క్లుప్తంగా

మాలధారులకు భిక్ష



మాలధారులకు భిక్ష వడ్డిస్తున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: 41 రోజుల పాటు అయ్యప్ప, శివ, భవాని మాలధారులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి నిర్వహిస్తున్న భిక్ష కార్యక్రమం సోమవారం 8వ రోజుకు చేరుకుంది. సోమవారం ఆయన పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మాలాధారులకు దగ్గరుండి భిక్ష వడ్డించారు. పట్టణంలోని అయ్యప్ప, శివ, భవాని మాలధారులందరూ భిక్ష కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ సంజీవనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ సంజీవనగర్, విజయనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

యాడికి: గర్భిణులు పౌష్టికారాన్ని తీసుకోవాలని యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారులు పరమేశ్వర్, అప్పయ్య దేవరాజన్ సూచించారు. సోమవారం మండల కేంద్రం, రాయలచెరువు పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువ ఉన్న వారికి ఐరన్ సుక్రోజ్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రికి వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖురాన్ కంఠస్థ పోటీలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణ యూనిటైడ్ ఫోరం ఫర్ ఖురాన్ సూడెంట్స్, ఐడియల్ యూత్ మూమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఖురాన్ కంఠస్థ పోటీలను నిర్వహించారు. పోటీల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఖురాన్ పఠించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముస్లింలు పవిత్ర గ్రంథం ఖురాన్‌ను పఠించడం అలవర్చుకోవాలన్నారు. పోటీల్లో మహమ్మద్ అర్షన్ మొదటి స్థానం, సయ్యద్ హనీయ తహసీన రెండో స్థానంలో నిలిచారు. వారికి నిర్వాహకులు ప్రశంసాపత్రంతోపాటు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 13న పోరుబాట

పామిడి: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 13న రైతు సమస్యలపై పోరుబాట కార్యక్రమం జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. పంటలకు మద్దతుధర, పెట్టుబడి సాయం, పంటల బీమా, ఇతరత్రా రైతు వ్యతిరేక కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆరోజు ఉదయం 10 గంటలకు అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు, మేధావులు, ప్రజలు, వైఎస్ అభిమానులు కదలి రావాలన్నారు.

ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా సోమవారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం కింద నెలకు రూ.21 వేలివ్వాలని కోరారు. కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, రాజేష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో హెడ్ పోస్టాఫీస్ భవనం

- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో సిబ్బంది, ఖాతాదారులు



భవనం పైభాగంలో ఇలా..



రేకులు లేచిన దృశ్యం



శిథిలావస్థకు చేరిన హెడ్ పోస్టాఫీస్ భవనం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న హెడ్ పోస్టాఫీస్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైభాగం పూర్తిగా దెబ్బతినింది. పెద్ద పెద్ద రంధ్రాలు పడ్డాయి. రేకులు, పెంకులు ఊడిపోయాయి. దీంతో భవనం కూలుతుందేమోనని పోస్టల్ అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇక భవనం గదుల్లో కూర్చొని విధులు నిర్వహించే పోస్టల్ అధికారులు, సిబ్బంది భయంతో వణికిపోతున్నారు. సుమారు వంద సంవత్సరాల క్రితం పెంకులతో భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకుంది. బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. భవనం పైభాగంలో పెద్ద పెద్ద రంధ్రాలు పడ్డాయన్నారు. ఏ క్షణంలో అయినా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ఇక ఖాతాదారులు పనిమీద కార్యాలయానికి వెళ్తే .. లోపల ఉండలేకపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో కొత్తగా వచ్చిన హెడ్ పోస్ట్ మాస్టర్ రాఘవేంద్ర చొరవ చూపి సొంత డబ్బుతో కొంతవరకూ మరమ్మతులు చేయించారు. సంబంధిత పోస్టల్ ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాలని పోస్టల్ సిబ్బంది, ఖాతాదారులు కోరుతున్నారు.

నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం



పోస్టాఫీస్ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. పోస్టల్ ఉన్నతాధికారులు తాము పంపిన ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. త్వరలోనే ఎంపీ, ఎమ్మెల్యేల లెటర్లు కూడా పోస్టల్ ఉన్నతాధికారులకు పంపుతాం. లెటర్లు చేరిన వెంటనే భవన నిర్మాణానికి నిధులు మంజూరు కానున్నాయి.

– రాఘవేంద్ర, హెడ్ పోస్ట్ మాస్టర్, గుత్తి

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పెద్దవడుగూరు/పామిడి: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ నాయకులు నారాయణ, ఎద్దుల సూర్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సోమవారం పెద్దవడుగూరులోని గాంధీ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి, స్వార్థం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నెత్తిన భారం పెట్టాయన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ఆపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు పోలా రంగస్వామి, సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ నాయకులు ఉసేన్‌పీరా, ఆదినారాయణ, నారాయణస్వామి, కిషోర్, ఆది ,రంగడు, ఓం నారాయణ పాల్గొన్నారు. అలాగే పామిడిలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద వామపక్షపార్టీల నాయకులు ధర్నా చేపట్టారు. సీపీఎం నాయకులు పీ అనిమిరెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కే రహీమ్ నాయకులు, మల్లేసు, వీరభద్రస్వామి, చౌడప్ప, రాముడు, శివయ్య, బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల్లో మొక్కలు నాటి నిరసన



గుంతల్లో మొక్కలు నాటుతున్న సీపీఐ, సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డు అధ్వానంగా మారింది. ఈ క్రమంలో సోమవారం రోడ్డు దుస్థితిపై సీపీఐ, సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు స్పందించారు. అందరూ కలిసి రోడ్డుపై ఉన్న గుంతల్లో పిచ్చి మొక్కలు నాటి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్, సీపీఎం నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ గాంధీ సర్కిల్ నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రాజు యాదవ్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం నాయకులు అడవి రాముడు, సీపీఎం నాయకులు మల్లేష్, వన్నూర్ సాహెబ్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రస్తా సమస్య పరిష్కరించండి



రోడ్డుకు అడ్డంగా వేసిన కంప చెట్లను తొలగిస్తున్న రైతులు

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో రస్తా సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు సోమవారం కోరారు. వివరాలు.. రైతు పొన్నతోట లక్ష్మీనారాయణరెడ్డి తన భూమిలో ఎవరూ వెళ్లకూడదంటూ కంపలు అడ్డం వేసి దారి పొడవునా గోతులు తీశాడు. 40 ఏళ్లుగా ఈ రస్తాలోనే మా తోటలకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఓ రైతు మాది అని అనడంతో సమస్య నెలకొందని సమీపంలోని రైతులు వాపోయారు. ఈ దారిలో దాదాపు 15 మంది రైతులు వెళ్లాలి. అదే దారి తోటల నుంచి పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి వెళ్తుంటారు. సోమవారం దారికి అడ్డంగా వేసిన కంపను రైతులు రవిచంద్రారెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, రామాంజులరెడ్డి, రమేష్‌రెడ్డి, రాజారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, సాలప్ప, శ్రీనివాసులు తదితరులు తొలగించారు. అధికారులు స్పందించి రస్తా సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

అవార్డుగ్రహీతలకు అభినందనలు





హెచ్‌ఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థులు జ్యోత్స్న, సందీప్

గుంతకల్లు రూరల్: మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పీ జ్యోత్స్న, సందీప్ బాలరత్న అవార్డులు పొందిన నేపథ్యంలో సోమవారం హెచ్‌ఎం నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వారిని అభినందించారు. ఇటీవల బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాదుకు చెందిన కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు వారు 14 సంవత్సరాల్లోపు పిల్లల నుంచి బాలరత్న అవార్డులకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పీ జ్యోత్స్న, సందీప్ తెలుగు సాహిత్యంలో వివిధ సంస్థల నుంచి పొందిన అవార్డులు, ప్రశంసాపత్రాలను పోస్టు ద్వారా పంపించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన ట్రస్టు ప్రతినిధులు వారిని బాలరత్న అవార్డుకు ఎంపిక చేస్తూ.. అవార్డులను పోస్టుద్వారా పాఠశాలకు పంపించారు. ఈ క్రమంలో సోమవారం పాఠశాలలో అభినందన సభను ఏర్పాటు చేసి ఇద్దరు విద్యార్థులను అభినందించారు.

చికిత్సల కోసం ఆర్థికసాయం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో సోమవారం ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బోడాయిపల్లికి చెందిన రెబల్ చికిత్సల నిమిత్తం అతని బాబాయ్ హరికృష్ణకు రూ.16 వేలు సంస్థ సభ్యులు అందజేశారు. గ్రామానికి చెందిన నాగేశ్వరి, మహేంద్ర కుమారుడు రెబల్‌కుమార్ సిమినర్ అప్లాస్టిక్ ఎనీమియాతో బాధపడుతూ బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. చికిత్సలకు రూ.16 లక్షలవుతుందని వైద్యులు చెప్పడంతో ఆపన్నహస్తం ఎదురు చూస్తున్న వారికి సంస్థ సభ్యులు నగదు వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గురప్ప, గౌరవాధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శివారు కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను సీపీఎం నాయకులు కోరారు. సోమవారం సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి తదితరులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని సీఐటీయూ, రామిరెడ్డి, అల్లీపీరా, కసాపురం రోడ్, దోనిముక్కల రోడ్, ప్రశాంతినగర్, భీమిరెడ్డి కాలనీల్లో నివాసముంటున్న ప్రజలు మున్సిపాలిటీకి ఆస్తి పన్నులు చెల్లిస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం చెందారని మారుతి ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కసాపురం రమేష్, రంగమ్మ, జగ్గిలి రమేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

భాష్పవాయువు ప్రయోగించడం దుర్మార్గం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి అర్బన్: పంటల మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ పంజాబ్‌లో రైతు సంఘాలు చేపట్టిన ధర్నాలో రైతులపై బాష్పవాయువు ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని సీపీఐ నాయకులు ఖండించారు. ఈ మేరకు సోమవారం స్థానిక మహాత్మాగాంధీ సర్కిల్‌లో రైతులపై కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల చిన్నచూపు చూస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకకపోతే.. రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాములు, రామాంజినేయులు, వృత్తిదారుల సంఘం నియోజకవర్గ కార్యదర్శి సాలవేముల సూరి, నాగేంద్ర, ఏఐటీయూసీ నాయకులు ఉమాగౌడ్ రవికుమార్, రమణ, రామకృష్ణ, నాగేష్, కృష్ణనాయక్, సంజన, అబ్రహం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

పెద్దవడుగూరు: గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని జి.వెంకటాంపల్లి, గుత్తి అనంతపురం గ్రామాల్లో ఎస్‌ఐ తన సిబ్బందితో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానితులు కనపడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా పోలీసుల దృష్టికి తీసుకరావాలన్నారు.పేకాట, మట్కా తదితర అసాంఘిక కార్యాకలాపాలకు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. పొలాల్లో మోటార్ పంపు సెట్టు, వైర్ల దొంగలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'రైతుల రుణాలు మాఫీ చేయాలి'

గార్లదిన్నె: రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ప్రభుత్వం వెంటనే మాఫీ చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమండ్ చేశారు.సోమవారం యర్రగుంట్లలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.20 లక్షలు ఇవ్వాలన్నారు. రాయల సీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి, మల్లన్న, శ్రీలక్ష్మి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ బదిలీ

యల్లనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్‌ను ఉన్నతాధికారులు తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను తాడిపత్రికి బదిలీ చేసినట్లు ఎస్‌ఐ శ్రీరాం ప్రసాద్ తెలిపారు.

కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా రామాంజనేయులు

గుంతకల్లు: కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా తగరం రామాంజనేయులను ఎంపిక చేసినట్లు గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దౌల్తాపురం ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రామాంజనేయులు తెలిపారు.

విద్యార్థినులకు భద్రత కల్పించండి



సూచనలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

బుక్కరాయసముద్రం: సెంట్రల్ యూనివర్శిటీలో విద్యార్థినులకు సరైన భద్రత కల్పించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి సూచించారు. సెంట్రల్ యూనివర్శిటీలో తమ బాత్‌రూంలోకి అక్కడ పనిచేస్తున్న బీహార్ యువకులు నిచ్చెనలు వేసుకుని చూస్తున్నారని పలువురు విద్యార్థినులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అధికారుల ఫిర్యాదు చేయడంతో పోలీసులు ముగ్గురు అనుమానిత యువకులను స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం సాయంత్రం సెంట్రల్ యూనివర్శిటీను పరిశీలించారు. విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిబ్బందిపై మండి పడ్డారు. విద్యార్థులకు భద్రత కల్పించాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీసీ కోరి, ఆర్డీఓ కేశవ నాయుడు ఎంపీపీ సునీత తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

బుక్కరాయసముద్రం: పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముందుగా ఆస్పత్రిలో రికార్డులు, మెడికల్ రూంను తనిఖీ చేశారు. హై రిస్క్ గర్భిణులకు చేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం పసుపుల బ్రదర్స్ ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రతి నెలా నిరంతర అన్నదాన కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మాన్, ఎంపీపీ సునీత, డాక్టర్ స్వాతి లక్ష్మి, పసుపుల శ్రీరామిరెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేర సమాచారం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాలు మేరకు.. విజయవాడకు చెందిన మధు అనే యువకుడు డ్రోన్ కంపెనీలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఆయన ద్విచక్ర వాహనంలో పామిడి వైపు వెళ్తుండగా కనంపల్లి క్రాస్ వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. అలాగే తలగాచిపల్లి క్రాస్ సమీపంలో ఓ యువకుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడుచుకుంటూ గార్లదిన్నెలోకి వస్తుండగా.. గార్లదిన్నె నుంచి గుత్తివైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. యుకుడు సమీపంలోని ముళ్ల కంపల్లోకి పడడంతో స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ.. ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో సోమవారం రెండు బైక్‌లు ఢీ కొని జెండా వీధికి చెందిన మహమ్మద్ హనీఫ్, అమృత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై సోమవారం కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో వివాన్ అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం, కరీంనగర్‌కు చెందిన బాలప్రకాష్ అనే వ్యక్తి తన కుమారుడు వివాన్‌తో కలసి కారులో బెంగుళూరుకు బయలుదేరాడు. వేగంగా ప్రయాణిస్తున్న వారి కారు గుత్తి మండలంలోని కరిడికొండ వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డుపక్కకు దూసుకెళ్లింది. ప్రమాదంలో వివాన్‌కు గాయాలవడంతో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు.

నాటు సారా విక్రేత అరెస్టు

గుత్తి: గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని చిక్కేపల్లిలో ఎక్సైజ్ సీఐ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓ ఇంటిలో నాటు సారా విక్రయిస్తున్న భీమేష్ రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి నుంచి ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐలు అస్లాంబేగ్, గోపాల్ రావు, హెడ్ కానిస్టేబుల్ విజయకుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గుత్తి: గుత్తికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకురాలు సునీతను కులం పేరుతో దూషించిన ఆర్‌ఎస్‌కు చెందిన సుధారాణిపై సోమవారం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వివరాలు.. పది రోజుల క్రితం డబ్బు విషయంపై సుధారాణి, సునీత గొడవ పడ్డారు. ఈ క్రమంలో బజారులో కులం పేరుతో సుధారాణి తనను దూషించిందని సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు విచారణ చేశారు. డీఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు సుధారాణిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాకే గోవిందు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సుధీర్, నాయకులు మధు, ఓబులేసు, అశోక్ తదితరులు డీఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడిపై దాడి

పామిడి: పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద ఓ యువకుడిపై దాడికి సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ యుగంధర్ సోమవారం తెలిపారు. పామిడమ్మవీధికి చెందిన కళ్యాణ్‌రామ్‌పై స్థానిక మార్కెట్ వీధికి చెందిన అజయ్ భౌతికదాడులకు పాల్పడ్డాడన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గుత్తిరూరల్: మండలంలోని టి.కొత్తపల్లి గ్రామ శివారులో బొగ్గులబట్టీలో పనిచేస్తున్న సుబ్బమ్మ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా, ఉలికుంట్ల పాడు మండలం, గొల్లపల్లి గ్రామానికి చెందిన సుబ్బమ్మ తన భర్త శ్రీనివాసులతో కలిసి టి.కొత్తపల్లి గ్రామ శివారులో ఉన్న బొగ్గులబట్టీలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల సుబ్బమ్మ అనారోగ్యం, కుటుంబ సమస్యలతో బాధపడుతుండేది. ఈక్రమంలో సుబ్బమ్మ ఇంట్లో ఎవరూలేని సమయంలో విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటోడ్రైవర్‌పై దాడి



గాయపడిన అనిల్

తాడిపత్రి రూరల్: మండలంలోని ఇగుడూరు గ్రామానికి చెందిన అనిల్ కుమార్‌పై సోమవారం అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆటోడ్రైవర్ అనిల్‌కుమార్ తాడిపత్రి నుంచి ఆటోలో ట్రిప్లను వేసుకునేందుకు నిరాకరించాడన్న ఆగ్రహంతో అదే గ్రామానికి చెందిన రమణయ్య, విశ్వనాథ్, నాగేంద్రతో పాటు మరొకరు కలిసి ఇంటి వద్ద అతనితో పాటు తల్లిపై రాళ్లతో దాడి చేశారు. గాయపడిన వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కాగా అనిల్ కుమార్‌పై దాడి చేయడం అమానుషమని మండల రైతు సంఘం నాయకుడు రాజారామిరెడ్డి అన్నారు. దాడికి కారణమైన నిందితులను అరెస్టు చేయాలని పోలీసులను కోరారు.

మట్కా బీటర్ అరెస్ట్

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో సోమవారం ఒక మట్కా బీటర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో మట్కా రాస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి షేక్ అహమ్మద్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి మట్కా చీటీలు, రూ.5 వేలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్పెంటర్ ఇంట్లో చోరీ

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో కార్పెంటర్ మస్తాన్ వలి ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. మస్తాన్ వలి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఇంటికి తాళాలు వేసి వేరే ఊరికి వెళ్లాడు. గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సోమవారం తిరిగి వచ్చిన ఆయన ఇంట్లో పరిశీలించగా బీరువాలో దాచి ఉంచిన మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. చోరీకి గురయ్యాయని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారిణి ఉమాదేవి

యాడికి: ఉద్యానశాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలను ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాడిపత్రి ఉద్యానశాఖ అధికారిని ఉమాదేవి సూచించారు. సోమవారం మండలంలోని పుప్పాల గ్రామంలో ఎస్సీ, ఎస్టీ రైతులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యాన పంటలైన అరటి, మామిడి, బత్తాయి, దానిమ్మ, జామ, అల్లనేరేడు, సీతాఫలం, కూరగాయల సాగుకు సంబంధించి అవగాహన కల్పించారు. ప్యాక్ హౌస్, ఫారం పాండ్, ఆర్‌కేవీ వై, ఎంఐడీహెచ్, స్టేట్ ప్లాన్ హోండా స్ప్రేయర్, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్స్ వంటి పథకాల గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో వీపీఏ త్రిపుర, ఎస్సీ, ఎస్టీ రైతులు పాల్గొన్నారు.